క్లుప్తంగా

ప్రయాణికులను దోపిడీ చేస్తున్న ఆర్టీసీ

మిర్యాలగూడ టౌన్ : రాఖీ పండుగ పేరుతో ప్రయాణికులను ఆర్టీసీ నిలువు దోపిడీ చేస్తుందని, సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సుల పేరుతో బేబులు గుల్ల చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆరోపించారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ సంస్థ సూపర్ లగ్జరితో పాటు స్పెషల్ బస్సుల పేరుతో 30నుంచి 40శాతం మేర చార్జీలను వసూలు చేస్తున్నారన్నారు. పండుగల పేరుతో ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచొద్దన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

డిండి : విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన డిండి మండల పరిధిలోని గోనబోయనపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండలంలోని గోనబోయనపల్లి గ్రామానికి చెందిన కొండ్రపల్లి ఇదమయ్య, మాడ్గుల మంగమ్మకు సంబంధించిన రెండు గేదెలు గ్రామ శివారులోని పొలంలో మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో అప్పటి వరకే తెగిపడి ఉన్న విద్యుత్ తీగ వాటికి తగలడంతో గేదెలు అక్కడిక్కడే మృతిచెందాయి. మృతి చెందిన గేదెల విలువ దాదాపు రూ.80 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

అడవిదేవులపల్లి : ఆగస్టు 5వ తేదీ నాటికి నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు ఈనెల 13వ తేదీలోగా రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సరిత తెలిపారు. శనివారం స్థానికంగా ఆమె మాట్లాడుతూ.. దరఖాస్తు ఫారం నింపి పట్టాదారుపాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లు జతపరిచి ఏఈఓకు లేదా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేడు వైద్యశిబిరం

నిడమనూరు : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిడమనూరులో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు బెల్టి అశోక్ శనివారం తెలిపారు. వైద్యశిబిరానికి ప్రముఖ డయాబెటిక్ డాక్టర్ సతీష్ కుమార్ హాజరై వైద్య సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరాన్ని నిడమనూరు, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశిబిరం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలియజేశారు.

వారాహిదేవి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



వారాహిదేవి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అన్నపూర్ణ మాత

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 19వ వార్డు ముత్తిరెడ్డికుంటలో సంతోషిమాత ఆలయంలో శనివారం సంతోషిమాత అమ్మవారి జన్మ దినోత్సవం సందర్భంగా అర్చకుడు కుమార్ వేదమంత్రోత్సాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీగణపతి హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద వారాహిదేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి అన్నపూర్ణ మాత, మాజీ కౌన్సిలర్ పత్తిపాటి సంజాత నవాబు భూమి పూజ, శంకుస్థాపన చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజలో చామల సైదులు, దుర్గ, రాయపూడి రామ్మూర్తి, సీత, వాసు- మాధవి, చంద్రయ్య- దుర్గ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

14న కట్టమీది ముత్యాలమ్మ బోనాలు



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని తాళ్లగడ్డలో గల పందిర్లపల్లి చెరువు పక్కన కొలువుదీరిన కట్టమీది ముత్యాలమ్మ తల్లి శ్రావణ మాస బోనాల పండుగను ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు స్థానిక ప్రముఖులు తెలిపారు. శనివారం స్థానిక వార్డు మాజీ కౌన్సిలర్ బాసాని అలివేలు గిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకొని ప్రకటించారు. సమావేశంలో కట్ట పుల్లయ్య, పానుగోతు చత్రునాయక్, మూల రాజిరెడ్డి, కుసరెడ్డి నాగేందర్‌రెడ్డి, తాడూరు నాగేందర్, బాసాని మల్లేష్, రేఖ నాగయ్య, చింతల శివ, దొనకొండ అంజి, కొత్తపల్లి ఉపేందర్, బాసాని రాము, చింతల మహేష్, రాచూరి నాగేందర్ తదితరులున్నారు.

యూజీడీ పనులు అస్తవ్యస్తం..!



రవీంద్రనగర్ కాలనీలో అసంపూర్తిగా పూడ్చిన పైపులైన్ గుంతలు



మ్యాన్‌హోల్‌పై మూతలు పెట్టని దృశ్యం

- పైపులైన్ గుంతలను సరిగా పూడ్చని కాంట్రాక్టర్
- రోజుల తరబడి కొనసాగుతున్న పనులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఇబ్బందుల్లో రవీంద్రనగర్ కాలనీ వాసులు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్రనగర్ కాలనీలో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనులు అస్తవ్యస్తంగా మారాయి. కాలనీలో వీధులన్నీ తవ్వి రోజుల తరబడిగా పనులు చేస్తున్నారు. వీధులను తవ్వించిన కాంట్రాక్టర్ పైపులను వేసి అక్కడక్కడ మాత్రమే పూడ్చారు. చాలాచోట్ల గుంతలను పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో స్థానికులు రాకపోకలకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వాహనాల రాకపోకలకూ ఇబ్బందే..

పైపులైన్ కోసం పది ఫీట్ల గుంతలు తవ్విన సదరు కాంట్రాక్టర్ మట్టిని ట్రాక్టర్లలో ట్రిప్పుల ప్రకారం అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో పైపులైన్ కోసం తవ్విన గుంతలు పూడ్చకుండానే మట్టిని అమ్ముకుంటుండడం.. కాలనీలో ద్విచక్ర, ఇతర వాహనాలు కూడా తిరగలేని పరిస్థితి నెలకొందని



రోడ్డు మధ్యలో మట్టి పోయకుండా వదిలేసిన దృశ్యం

స్థానికులు అంటున్నారు. కనీసం స్కూల్ బస్సులు కూడా రాలేని పరిస్థితులు ఉన్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ ఏఈ గారికి ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చినా ఎలాంటి స్పదన లేదని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మ్యాన్‌హోల్స్‌పై మూతలేవీ!

మ్యాన్‌హోల్స్ నిర్మాణాలు పూర్తిచేసి వాటిపై కనీసం మూతలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో అవి కూడా ప్రమాదకరంగా మారాయని కాలనీ వాసులు అంటున్నారు. దీనికి తోడు గుంతలు తవ్వే సమయంలో కాలనీలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులు పగిలిపోయి తాగునీరు వృథాగా పోతుండడంతో వీధులు బురదమయంగా మారుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలనీలో పైపులైన్ కోసం తవ్విన మట్టిని తరలించకుండా అదే మట్టితో గుంతలను పూర్తిస్థాయిలో పూడ్చి ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గుంతలను పూడ్చించాలి



కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం అంటూ బజార్లన్నీ తవ్వారు. పైపులు వేసిన తరువాత గుంతలను సరిగా పూడ్చకుండా వదిలేశారు. తవ్విన మట్టిని మాత్రం ట్రాక్టర్లలో తీసుకపోతున్నారు. ఇదేమిటని అడిటే సిబ్బంది మాపైనే గొడవకు దిగుతున్నారు. రోడ్లన్నీ గుంతలుగా మారడంతో స్కూల్‌బస్సులు కూడా రావడంలేదు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూర్తిస్థాయిలో పూడ్చించాలి.

– జుమ్మాని, రవీంద్రనగర్ కాలనీ

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను బొందపెట్టాలి

- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ : బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు బొందపెట్టాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మిర్యాలగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని.. అందులో భాగంగానే కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలో ధర్నా నిర్వహించామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మద్దతు ఇవ్వడం లేదన్నారు. బీసీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీసీ బిల్లును అమలు చేయకుండా బీసీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. బిహార్‌లో ఎన్‌డీఏ కూటమికి ఓట్లు వేయని మైనార్టీలకు చెందిన సుమారు 65లక్షల ఓట్లను తొలగించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని బీసీ రిజర్వేషన్లను అమలు చేసి ఇచ్చిన హామీని నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకునూరి బసవయ్యగౌడ్, మాలి కాంతారెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, తలకొప్పుల సైదులు, మహబూబ్‌అలీ, చలపతిరావు, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్, జవహర్, నెహ్రూ, నాగరాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన

కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో ప్రజాపాలన అందుతోందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 9 మందికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం ఆయన మిర్యాలగూడలోని విద్యానగర్ కాలనీలో



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

అందించి మాట్లాడారు. పేదలు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో సీఎం సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆయా మండలాల అధ్యక్షుడు కాకునూరి బసవయ్యగౌడ్, మాలి కాంతారెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు తలకొప్పుల సైదులు, మహబూబ్‌అలీ, చలపతిరావు, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్, జవహర్, నెహ్రూ, నాగరాజు, హరీష్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సైకాలజిస్టులను నియమించాలి

రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో సైకాలజిస్టులను నియమించాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు శనివారం ఆయన పట్టణంలో ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో విద్యార్థులు ఆందోళన, మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థులపై ఒత్తిడిని నివారించేందుకు సైకాలజిస్టులు కౌన్సిలింగ్ ఇస్తారని కావునా అన్ని విద్యాసంస్థల్లో ప్రభుత్వం సైకాలజిస్టులను నియమించాలని కోరారు. సరైన సమయంలో ఇచ్చే కౌన్సిలింగ్ మానసిక, నైతిక, సామాజిక ప్రవర్తనలలో మార్పులు తీసుకొచ్చి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపయోగపడుతుందన్నారు. విద్యాసంస్థల్లో సైకాలజిస్టులను నియమించాలని సుప్రీంకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని ప్రభుత్వం స్పందించి నియామకాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కర్ణం లింగయ్య పాల్గొన్నారు.

గిరిజన హక్కులను కాపాడడంలో కేంద్రం విఫలం



పెద్దవూర : పెద్దవూరలోని గిరిజన యోధులకు నివాళులర్పిస్తున్న ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు

హాలియా : గిరిజన హక్కులను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం(టీజీఆర్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ అన్నారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా శనివారం హాలియా పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో టీఆర్‌జీఎస్ ఉద్యోగుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ఎంఈవో జటావత్ చంద్రుడు నాయక్‌తో కలిసి కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో టీఆర్‌జీఎస్ రాష్ట్ర సహాయక కార్యదర్శి రమావత్ నరేష్‌నాయక్, ఉపాధ్యక్షుడు రమావత్ జవహర్ నాయక్, రమావత్ లలితబాయి, కొర్ర రాజునాయక్, రమావత్ కవితబాయి, మునిలాల్, రాజునాయక్, చైతన్య నాయక్, పద్మబాయి ఉన్నారు.



హాలియా : కేక్ కట్ చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

పెద్దవూర : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన యోధులు కొమరం భీం, బిర్సా ముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదివాసీల జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఆదివాసీల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి.బాలోజీ నాయక్, వసతి గృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు షబ్బీర్, షాహీన్‌బేగం, ఏఎన్ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు డీఆర్‌లు చెల్లించాలి

నల్లగొండ టౌన్: పెన్షనర్లకు ఇవ్వాల్సిన డీఆర్‌లను చెల్లించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జి వెంకట్ రెడ్డి కోరారు. శనివారం పెన్షనర్స్ భవన్‌లో గజవెల్లి సత్యం అధ్యక్షతన నిర్వహించిన మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ నెలలో బర్త్‌డేలు ఉన్న 30మంది పెన్షనర్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాద వాసుదేవ్, జెల్లా శ్రీశైలం, కె.రామలింగం, జిల్లా పుల్లయ్య, శేషారెడ్డి, నేలపట్ల రఘునాథం, ఎం గోపాల్ రెడ్డి, ఏం కేశవాచారి, ఎస్. రవి ప్రసాద్ రావు, బిక్షం, ఎస్. ఆంజనేయులు, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

మిర్యాలగూడ : పట్టణంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి రౌండ్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి యువజన కాంగ్రెస్ రికార్డు సాధించిందన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మిర్యాలగూడలో యువజన కాంగ్రెస్ మరింత బలోపేతమవతుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ చిరుమర్రి కృష్ణయ్య, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అజహర్, షేక్ పర్వేజ్‌ఖాన్, ఆరిఫ్, నామ అజయ్, సతీష్, గాలం వేణు, వినయ్‌కుమార్, మహేష్, సురేష్, చంటి, నాగరాజు, మునావర్, కరీం పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

డిండి : యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు సాయికుమార్, కిట్టు, ప్రవీణ్, ఉమర్, మల్లేష్, శ్రీశైలం, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.



డిండి: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలలో పాల్గొన్న నాయకులు

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శనివారం రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బీసీ, ఎస్సీ మహిళా సంఘాల నాయకురాళ్లు బంటు కవిత, చిత్రం ఉమాల ఆధ్వర్యంలో పలువురికి రాఖీలు కట్టి సాయిత్రీబాయి పుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతిక రాఖీ పండుగ అని అన్నారు. కార్యక్రమంలో మురళియాదవ్, నాగేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, సత్యప్రకాశ్, వజ్రగిరి అంజయ్య, ఇమ్రాన్ ఉన్నారు.

కస్తూరిబా బాలికల విద్యాలయంలో..

మిర్యాలగూడ మండలం అవంతిపురంలో గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. మాలమహానాడు విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్, పరంగి సురేష్, లావూడి రవీందర్‌నాయక్, సత్య, శ్రీకాంత్, అన్వేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో..

పట్టణంలోని మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో పతాంజలి యోగా నిర్వాహకుల ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో యోగా నిర్వాహకులు పాలిశెట్టి లక్ష్మయ్య, రాచయ్య, గోవర్ధన్‌రెడ్డి, వీరారెడ్డి, శ్రీనివాస్, శంకర్‌నాయక్, శివశంకర్, శ్రీను, లవకుమార్, వరలక్ష్మి, వాసవి, అరుణ, శారద, పద్మ, శ్రీలక్ష్మి, మీనాక్షి తదితరులు ఉన్నారు.



పెద్దవూర : సాగర్‌లో ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళ

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

పెద్దవూర : రాఖీ పౌర్ణమిని శనివారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ, పైలాన్‌కాలనీలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డికి, తెలంగాణ జెన్కో చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్‌కు, సీఐ శ్రీనునాయక్‌లకు మహిళలు రాఖీలు కట్టారు.

దేవరకొండ : దేవరకొండలో రక్షాబంధన్ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెలు తమ సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వదించారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి, గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాఖీ కట్టారు.



దేవరకొండ : ఎమ్మెల్యే బాలునాయక్‌కు రాఖీ కడుతున్న మాజీ ఎంపిటిసి గౌతమి



పెద్దవూర : సాగర్‌లో తెలంగాణ జెన్కో చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్‌కు రాఖీ కడుతున్న మహిళ



మిర్యాలగూడ : అవంతీపురం కేజీబీవీలో విద్యార్థి సంఘాల నాయకులకు రాఖీలు కడుతున్న విద్యార్థులు



మిర్యాలగూడ : ఎన్ఎస్‌పీ క్యాంపులోని మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో..



సాగర్‌లో సీఐ శ్రీనునాయక్‌కు రాఖీ కడుతున్న మహిళా కానిస్టేబుల్

ఆరు క్వింటాళ్ల బెల్లం పట్టివేత



పట్టుబడిన బెల్లం వాహనంతో పోలీసులు

చింతపల్లి : అక్రమంగా బెల్లం తరలిస్తున్నరన్న సమాచారంతో పోలీసులు నిఘా పెట్టి ఆరు క్వింటాళ్ల బెల్లాన్ని పట్టుకున్నారు. ఈ సంఘటన శనివారం పోలేపల్లి రాంనగర్ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ ముత్యాల రామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మాల్ వైపు నుంచి మల్లేపల్లి వైపు ట్రాలీఆటోలో బెల్లం తరలిస్తున్నారని సమాచారం మేరకు మండల పరిధిలోని వింజమూర్ ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు నిఘా పెట్టారు. ఆటోను తనిఖీ చేయగా ఆరు క్వింటాళ్ల బెల్లం ఉన్నట్లు గుర్తించి ఆటోతో పాటు డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

మాదకద్రవ్యాల నివారణే లక్ష్యంగా..

- ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం

మిర్యాలగూడ టౌన్ : తనకు సెలవు ఉన్న, ఖాళీ సమయం దొరికినా మాదకద్రవ్యాల నివారణపైనే ఆ ఉపాధ్యాయుడి పోరాటం. జాతరలు, సంతలు ఇలా జనాలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక వేషాధారణలో డ్రగ్స్ నివారణపై వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తుంటాడు ఆయన. మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన రాచకొండ ప్రభాకర్ సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. సెలవులు, ఖాళీ సమయంలో సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. శనివారం మిర్యాలగూడ మండలం అవంతీపురం సంత రద్దీగా ఉండటంతో విచిత్రమైన వేషాధారణలో ఒక చేతిలో మైకు పట్టుకొని మరోచేత్తో కరపత్రాలు పంచుతూ డ్రగ్స్‌తో కలిగే అనార్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాడు. ఈ సందర్భంగా రాచకొండ ప్రభాకర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు.



అవంతీపురం సంతలో డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న రాచకొండ ప్రభాకర్

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం

మిర్యాలగూడ : విద్యార్థుల ఆత్మరక్షణకు తైక్వాండో దోహదపడుతుందని శాంతినికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ లీమా మేరీ, ముఖ్య ఎగ్జామినర్ పట్టెడ సుధాకర్ అన్నారు. శనివారం దామరచర్ల మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో 61 మంది విద్యార్థులుగా పాల్గొనగా 33 మంది ఎల్లో, 13 మంది ఎల్లో వన్ బెల్ట్, 8 మందికి గ్రీన్ బెల్ట్, నలుగురు గ్రీన్‌వన్ బెల్ట్, ముగ్గురు బ్లూ బెల్ట్‌లను గెలుపొందారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొడ్డు వీరస్వామి, దారగాని వెంకటేశ్వర్లు, అన్నెం కరుణాకర్‌రెడ్డి, సందాల సదానందం, షేక్ జానీపాషా, కుందూరు సైదిరెడ్డి, నాగిరెడ్డి, సీతారాంరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తైక్వాండోలో వివిధ బెల్ట్‌లు సాధించిన విద్యార్థులు